కడప నగరానికి ఎన్ఐహెచ్ సేవలు

- రాజీవ్ మార్గ్‌లో వ్యాపారాలు చేసుకునేందుకు బహిరంగ వేలం
- నగరపాలక స్టాండింగ్ కమిటీ తీర్మానాలు

కడప కార్పొరేషన్: చిన్నపాటి వర్షానికే కడప నగరంలో రహదారులపై నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ (ఎన్ఐహెచ్) వారి సేవలు వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ నిర్ణయించింది. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరదనీటి ఉపశమనానికి చేపట్టాల్సిన పనులు, డ్రైన్ నెట్‌వర్క్, లెవెల్స్ పరిశీలనకు ఎన్ఐహెచ్ వారితో డీపీఆర్ రూపొందించాలని, అందుకోసం రూ.25.30లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. రాజీవ్ మార్గ్ రోడ్డులో రాజీవ్ పార్కు ముందు భాగాన ఉన్న ప్రదేశంలో తోపుడు బండ్లు, టిఫెన్ సెంటర్లు, పానీపూరీ బండ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకునేందుకు బహిరంగ వేలం నిర్వహించి 47 తోపుడు బండ్లకు అనుమతి ఇచ్చారు. ఇందులో 33 శాతం బండ్లను డ్వాక్రా సంఘాలకు కేటాయించాలని నిర్ణయించారు. మామిళ్లపల్లె ఇందిరానగర్‌లో కొత్త పార్కు ఏర్పాటు చేయుటకు రూ.12.50 లక్షలు, బుగ్గ అగ్రహారంలో దోభీఘాట్ నిర్మాణానికి రూ.20 లక్షలు, చంద్రమౌళీనగర్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో సీసీ రోడ్లు వేయుటకు రూ.13 లక్షలు మంజూరు చేశారు. నూతన జంతు వధశాల నిర్మించుటకు, మున్సిపల్ ఇండోర్ స్టేడియం, అవుట్ డోర్ స్టేడియం ఆధునీకరణ కోసం కన్సల్టెన్సీ నియమించుటకు అంగీకారం తెలిపారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో ఉన్న 3200కేఎల్ సామర్థ్యం ఉన్న పాత ఈఎస్ఎస్ఆర్‌ను కూల్చివేసి, 1000 కేఎల్ సామర్థ్యంతో కొత్త ఈఎల్ఎస్ఆర్ నిర్మాణానికి ఆహ్వానించిన టెండర్లను ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్, స్టాండింగ్ కమిటీ సభ్యులు షఫీ, శిరీష, హైమవతి, డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, ఎస్ఈ రత్నాల రాజు, డీసీపీ సూరజ్ కుమార్, ఇన్‌చార్జి ఈఈ కరిముల్లా, డీఈలు పాల్గొన్నారు.



స్టాండింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న మేయర్ సురేష్ బాబు, కమిషనర్ ప్రవీణ్‌చంద్

క్లుప్తంగా

పంట కాల్వలను పూర్తి చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టుల కింద ఉన్న పంట కాల్వలను వెంటనే పూర్తి చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యంవి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా సమితి సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రాజెక్టులలో నీరు ఉన్నప్పటికీ పంట కాల్వలు లేకపోవడంతో రైతులకు ఉపయోగపడని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ఈ సమస్యలపై ఈ నెల 30, 31 తేదీల్లో సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు కట్టా యాదయ్య, బాలచంద్రయ్య, వైవీ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యువజన కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేసి నిరుద్యోగ యువతను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సందీప్, ప్రధాన కార్యదర్శులు తిరుమల్లేష్, సుశీల్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సుమంత్ కుమార్ పాల్గొన్నారు.

జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో బదిలీలు, పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి–2లతోపాటు హైస్కూల్ ప్లస్‌లో బోధించే పీజీటీలకు గత మూడు నెలలుగా జీతాల అందక ఇబ్బందులు పడుతున్నారని ఏపీ ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఈ విషయమై మంగళవారం కడప పార్లమెంట్ సభ్యులు ఎంపీ అవినాష్‌రెడ్డిని కలిసి సమస్యను వివరించి వినతిపత్రాన్ని సమర్పించారు. దీనిపై స్పందించిన ఎంపీ అవినాష్‌రెడ్డి ఉపాధ్యాయులకు జీతాలు మంజూరయ్యేలా కృషి చేస్తానని, మిగతా సమస్యలన్నీ పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

షరతులు లేకుండా సర్వీసు క్రమబద్ధీకరించాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగుల సర్వీసును షరతులు లేకుండా క్రమబద్ధీకరించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కేజీబీవీ, గురుకుల పాఠశాలలు, విశ్వ విద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం క్రమబద్ధీకరించాలన్నారు. వివిధ శాఖల్లో ఏళ్ల తరబడి పనిచేస్తున్న పొరుగు సేవల వారిని కాంట్రాక్టు పరిధిలోకి తీసుకొచ్చి రెండేళ్ల ప్రొబేషన్ పూర్తయిన తర్వాత వారిని కూడా క్రమబద్ధీకరించాలని కోరారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి

వైవీయూ : విద్యార్థినులు ఆరోగ్యానికి, శరీర సౌష్టవానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వేమల సలీంబాషా సూచించారు. కళాశాల వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరిలో చైతన్యం తీసుకువచ్చేందుకు ఫిట్ ఇండియా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన అనంతపురం స్పైస్ కోఆర్డినేటర్ కె. ఆనందభాస్కర్ మాట్లాడుతూ ఆరోగ్యం, ఫిట్‌నెస్ ఉన్నవాళ్లు చదువులో కూడా చక్కగా రాణించగలరన్నారు. అనంతరం వివిధ రకాల క్రీడాపోటీలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించారు.

బాల్య వివాహాలు నేరం



సమావేశంలో మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ పోలీసు అధికారి జ్యోతి

కడప ఎడ్యుకేషన్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వన్‌స్టాప్ సెంటర్ పోలీసు అధికారి జ్యోతి అన్నారు. మంగళవారం కడపలోని శ్రీహరి జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌తోపాటు బాల్య వివాహాల గురించి వన్ స్టాప్ సెంటర్ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి వన్‌స్టాప్ పోలీసు అధికారి జ్యోతి, కేస్ వర్కర్ మాధవీలత, దేవిక హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్ట ప్రకారం బాల్య వివాహాలు చేయడం పూర్తిగా నిషేధం అన్నారు. పెళ్లి వయసు రాకుండా మైనర్‌లకు వివాహం చేస్తే జరిమానాతోపాటు జైలు శిక్ష తప్పదన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థులకు తెలియచేశారు. అలాగే వన్‌స్టాప్ సెంటర్ ఇచ్చే ఫెసిలిటీస్ గురించి తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం

- ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్ బాషా

కడప కార్పొరేషన్: గడప గడపకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా అన్నారు. మంగళవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా.. 22/1 వ డివిజన్ మారుతీ నగర్ సచివాలయం –1లోని మారుతీ నగర్ లోని రాజారెడ్డి వీధుల వద్ద గల పలు ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు పొందిన లబ్ధికి సంబంధించిన సమాచారంతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఈ ప్రభుత్వం వల్ల తమకు మేలు జరిగిందని ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. మరికొందరు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం సమస్యలను పరిష్కరించాలని సంబంధింత శాఖల అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా అంజద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పనిచేస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల, మత, పార్టీలకతీతంగా అర్హత ఉన్న పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు.



ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

పూసల పంకజ అనే మహిళ మాట్లాడుతూ తనకు జగనన్న వసతి దీవెన, వైఎస్ఆర్ సున్నా వడ్డీ, జగనన్న విద్యా దీవెన, వైఎస్ఆర్ చేయూత, జగనన్న ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి నగదు ద్వారా రూ.10,33,090 లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేసింది.

- షేక్ మహమ్మద్ జాన్ మాట్లాడుతూ ఇన్ని సంక్షేమ పథకాలు ఏ ప్రభుత్వం లో మాకు అందలేదని ఇలాంటి ముఖ్యమంత్రి కి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలిపారు.
- ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, 22వ డివిజన్ ఇన్‌చార్జి రామచంద్రయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బీహెచ్ ఇలియాస్, బంగారు నాగయ్య, సీహెచ్ వినోద్, మున్నా, పస్తం అంజి, షఫీ, తోటక్రిష్ణ, బండి ప్రసాద్, బాల స్వామి రెడ్డి, పవర్ అల్తాఫ్, అహమ్మద్, రత్నకుమారి, టి.పీ సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, మరియలు, సుశీలమ్మ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు

కడప రూరల్ : గర్భిణుల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంతోపాటు వైద్య సిబ్బంది అందుకు సంబంధించి పలు చర్యలు చేపట్టాలని ఓఎస్‌డీ రఘునాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలసపాడు, శ్రీరాములపేట, వికలాంగుల కాలనీలలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు ప్రాథమిక దశలోనే గర్భవతుల సమస్యలను గుర్తించి డాక్టర్ల ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల లో అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా గర్భవతుల కుటుంబ సభ్యులు, ఆరోగ్య సిబ్బంది ఇచ్చిన సూచనలను పాటించాలన్నారు. రెఫరల్ ఆస్పత్రులలో వైద్యులు సకాలంలో స్పందించి మాతృ మరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో మాతృ మరణాలు లేకుండా సమిష్టిగా కలిసి పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, వైద్య విధాన పరిషత్ కో ఆర్డినేటర్ హిమాదేవి, గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ లక్ష్మీసుశీల, అనస్థిషియా హెచ్‌ఓడీ డాక్టర్ సునీల్, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడీ సురేశ్వర్‌రెడ్డి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరరావుతోపాటు ఆరోగ్యశాఖ అధికారులు, ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులు పాల్గొన్నారు.



రాహుకాల పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం రాహుకాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తికి విశేష అభిషేకాలు, అలంకారం, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దర్శనానంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం చెన్నూరుటౌన్‌లోని రాజులకాలనీ, సరస్వతీనగర్, కొత్త గాంధీనగర్‌లలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది, కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఆయన తనయుడు చింతకొమ్మదిన్నె జెడ్పీటీసీ నరేన్ రామాంజనేయులురెడ్డికి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు బ్రహ్మరథం పట్టారు, ఈ సందర్భంగా వారు గడపగడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంతెంత లబ్ధి చేకూరిందో వివరించారు. అంతే కాకుండా ఆయా కుటుంబాలలో ఏయే సమస్యలు ఉన్నాయో అడిగి తెలుసుకుని వాటిని అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా ముఖ్యమంత్రి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఒకవేళ ఏదైనా సమస్య వల్ల ప్రభుత్వ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇక్కడ కులాలు, మతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. మీ అందరి చల్లని దీవెనలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, జెడ్పీటీసీ దిలీప్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్ఆర్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, కమలాపురం నియోజకవర్గం మైనార్టీ కన్వీనర్ అన్వర్‌బాషా, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

దాతల సహకారం సద్వినియోగం చేసుకోవాలి

కమలాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రేటర్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు బచ్చు వెంకట సుబ్రమణ్యం తెలిపారు. మంగళవారం పట్టణంలోని బీడీ కాలనీ, రామచంద్రాపురం ఎంపీపీ పాఠశాలలకు చెందిన దాదాపు 100 మంది విద్యార్థులకు కమలాపురం గ్రేటర్ వాసవీ క్లబ్ ఆర్య వైశ్యులు విద్యా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ సెక్రటరీ భోజనపాటి సుధాకర్, ట్రెజరర్ గాజులపల్లె చంద్రశేఖర్ ఉపాధ్యాయులు నాగమణి, జయలక్ష్మీ విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జమ్మలమడుగు: జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో ప్రభుత్వ ఐటీఐలలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపల్ నవరూప్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడో విడత అడ్మిషన్‌ల కోసం పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 27వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 30వతేదీన ఉదయం పది గంటలకు జమ్మలమడుగు, మైలవరం ఐటీఐలలో కౌన్సెలింగ్ ఉంటుందన్నారు.

చురుగ్గా వంతెన నిర్మాణ పనులు

వీరపునాయునిపల్లె: ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామ సమీపంలోని వాగులో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మంగళవారం మండల అధ్యక్షుడు కల్లూరు రఘునాథరెడ్డి వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వాగులో నీరు అధికంగా ప్రవహిస్తుండటంతో ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. గత ఏడాది వాగులో ఇద్దరు వ్యక్తులు ఇరుక్కుపోయారన్నారు. వెంటనే ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డికి తెలియజేయడంతో జిల్లా స్థాయి యంత్రాంగాన్ని ఇక్కడికి రప్పించి వారిని రక్షించారన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పందించి సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రూ.57లక్షల నిధులు మంజూరు చేయించి వాగుపై వంతెన నిర్మించడంతో పాటు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు.

ఈ–పంట నమోదు తప్పనిసరి

సిద్దవటం : ఖరీఫ్ 2023లో పంటలు సాగు చేసిన ప్రతి రైతు అన్నీ రకాల ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాల కోసం ఈ – పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని బద్వేల్ ఏడీఏ నాగరాజా తెలిపారు. మండలంలోని టక్కోలి రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డితో కలిసి ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, రిజిస్టర్‌లను తనిఖీ చేసి, యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లడుతూ ఖాజీపల్లెలో ఈ – పంట నమోదు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించమన్నారు. ఈ – పంట నమోదు ఇప్పటి వరకు 70 ఎకరాలకు పైగా పూర్తయిందన్నారు. ఇంకా 300 ఎకరాలకు పైగా చేయాల్సి ఉందన్నారు. నెలాఖరులోపు పూర్తి చేయాలని ఆర్బీకే సిబ్బందికి ఆదేశించినట్టు తెలిపారు. ఎటువంటి పొరపాట్లు లేకుండా, విమర్శలకు తావు లేకుండా, అత్యంత పారదర్శకంగా ఈ – పంటను నమోదు పూర్తి చేయాలని సూచించారు. ప్రతి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు పుష్కలంగా ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వహించాలి



డ్రైవర్లు, క్లీనర్లతో వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ: విధి నిర్వహణలో నిత్యం అప్రమత్తంగా ఉంటూ క్రమశిక్షణతో మెలగాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. మంగళవారం వైవీయూలోని ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పనిచేస్తున్న 15 మంది డ్రైవర్లు, క్లీనర్లకు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యతో కలిసి యూనిఫాం, షూ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డ్రైవర్లందరూ సమయపాలన పాటించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో పనిచేసేవారి సంక్షేమం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ డ్రైవర్లు చక్కగా బాధ్యతలు నిర్వహిస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో వైవీయూ ట్రాన్స్‌పోర్ట్ విభాగం సమన్వయ కర్త డా. తమ్మినేని శ్యామ్‌స్వరూప్ పాల్గొన్నారు.

మా డిజైనర్ ఎగ్జిబిషన్ అండ్ సేల్‌కు స్పందన



ఎగ్జిబిషన్ సేల్‌లో షాపింగ్ చేస్తున్న మహిళలు

కడప కార్పొరేషన్: కడప నగరంలో ఎస్పీ బంగళా ఎదురుగా ఉన్న హరిత హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మా డిజైనర్ ఎగ్జిబిషన్ అండ్ సేల్‌కు విశేష స్పందన లభించినట్లు ప్రొప్రైటర్ జింకా క్రిష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 23వ తేదీలో కూడా ఎగ్జిబిషన్ జరుగుతుందన్నారు. ఇందులో సరికొత్త డిజైనర్ శారీస్, కలకత్తా, బెనారస్, ఆర్ గంజా, టస్సార్, జార్జెట్, కాటన్ శారీస్, కంచిపట్టు కోటా శారీస్ లభిస్తాయన్నారు. డ్రస్ మెటీరియల్స్, బెడ్‌షీట్స్, దివాన్ సెట్స్, ఫ్యాబ్రిక్ మొదలైన వాటితో పాటు 92.5 గోల్డ్ కవరింగ్ జ్యూవెలరీ లభిస్తుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కలెక్టర్‌ను కలిసిన ఎఫ్‌సీఐ సభ్యుడు సుధీర్

కడప కార్పొరేషన్: కన్సల్టేటివ్ కమిటీ ఆఫ్ ఫుడ్ కార్పొరేషన్(ఎఫ్‌సీ) మెంబర్‌గా నియమితులైన కమలకూరు సుధీర్‌కుమార్‌రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

పెండ్లిమర్రి: రైతులు పండించిన ప్రతి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని బీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి కోరారు. పెండ్లిమర్రిలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ–క్రాప్‌లో అవకతవకలను నివారించాలన్నారు.

అలాగే వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించరాదన్నారు. ఇన్సూరెన్స్ విధానంలో మార్పులు చేసి రైతులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు జనార్దన్‌రెడ్డి, వెంకటరెడ్డి, ఓబుల్‌రెడ్డి, గంగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పుష్పగిరి గుట్ట సర్వే

వల్లూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పుష్పగిరి గుట్టను అధికారులు మంగళవారం సర్వే చేశారు. వల్లూరు మండల సర్వేయర్ సర్వేశన్ ఆధ్వర్యంలో రెవెన్యూ రికార్డుల ఆధారంగా డీజీపీఎస్ రోవర్ ద్వారా సర్వేను నిర్వహించారు. కొట్లూరు రెవెన్యూ గ్రామ పరిధిలోని 1077 సర్వే నంబర్‌లో 730. 53 ఎకరాల విస్తీర్ణంలో వున్న పుష్పగిరి గుట్టకు సంబంధించి తూర్పు వైపున సరిహద్దులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పుష్పగిరి ఆలయ ఈఓ మహేశ్వర్ రెడ్డి, విలేజ్ సర్వేయర్‌లు సుబ్బరాయుడు, మహేష్, వీఆర్‌ఓ నరసింహులు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పన్నులు చెల్లించకుండా, నియమ నిబంధనలు ఉల్లంఘనల కారణంగా పట్టుబడి ఇంతవరకు వాహన యజమానులు విడిపించుకోని వాహనాలను ఈనెల 29వ తేదీన వేలం వేయనున్నట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మీరా ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. లైట్ గూడ్స్ వెహికల్స్ 26, ఆటోరిక్షాలు 22, మోటార్ సైకిళ్లు 75 వేలం వేసేందుకు రవాణాశాఖ నోటీసులు జారీ చేసిందన్నారు. వేలంలో పాల్గొనదలిచిన వారు రూ. 5000 ధరావత్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

నేడు శాంతి ర్యాలీ

కడప కల్చరల్ : కడప నగరంలోని జియోన్ వ్యాయామ కళాశాల నుంచి బుధవారం నిర్వహించనున్న శాంతి ర్యాలీని జయప్రదం చేయాలని అంతర్జాతీయ క్రైస్తవ ప్రసంగీకులు డాక్టర్ టీడీ ప్రసన్నకుమార్ కోరారు. మంగళవారం ఆయన రాజారెడ్డివీధిలోని తమ చర్చి కార్యాలయంలో విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. నెలల తరబడి అరాచకాలకు నిలయంగా మారిన మణిపూర్‌లో వెంటనే శాంతి సాధనకు కృషి చేయాలని కోరుతూ నగరంలోని ఇతర క్రైస్తవ సంఘాలతో కలిసి ఈ శాంతి ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభం కానున్న ర్యాలీ సంధ్య సర్కిల్ వరకు వెళ్లి తిరిగి బయలుదేరిన చోటికి వస్తుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ నిబంధనల గురించి వివరిస్తున్న దృశ్యం

వైవీయూ: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కడప ట్రాఫిక్ ఎస్ఐ సి. శ్రీనివాసులు సూచించారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ లైసెన్స్ పొందకుండా వాహనాలను నడపకూడదన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు అనుసరించి డ్రైవింగ్ చేయాలన్నారు. సురక్షిత డ్రైవింగ్ ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. నిబంధనలు అతిక్రమించే వారికి విధించే జరిమానాలు, శిక్షల గురించి వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా, కోఆర్డినేటర్ విన్నీ తేజ, వీరభద్రయ్య, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాలను మార్చాలి



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరంలో రహదారుల విస్తరణ జరుగుతున్న మాసాపేట రోడ్డు, గోకుల్ లాడ్జి– క్రిష్ణా సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్– వై జంక్షన్ రోడ్లలో ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ తెలిపారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన రహదారుల విస్తరణ పనులను పరిశీలించారు. కొత్తగా మురికి కాలువలు నిర్మిస్తున్న నేపథ్యంలో ఎక్కడా మురికి నీరు నిలవకుండా శానిటేషన్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన చోట మొక్కలు నాటాలన్నారు. గోకుల్ లాడ్జి నుంచి క్రిష్ణా సర్కిల్ మార్గంలో డ్రైనేజీ కాలువ పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. విస్తరణ పనుల వల్ల ఏర్పడే వ్యర్థాలను వెంటనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ సూరజ్ కుమార్, ఏసీపీ నాగేంద్ర, ఆర్అండ్‌బి అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు టీచర్లకు అవార్డులు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు కూడా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటించాలని ప్రైవేటు టీచర్లు, లెక్చరర్ల సంఘం రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు కోరారు. పనికి తగ్గ వేతనం లేకపోవడంతోపాటు ఉద్యోగ భద్రత లేనప్పటికీ విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దిన ఘనత ప్రైవేటు టీచర్లకు ఉందన్నారు. సెప్టెంబర్ 5వ తేదీన జరిగే ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ప్రవేటు ఉపాధ్యాయులను కూడా రాష్ట్ర ప్రభుత్వం సత్కరించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో మంగళ గౌరీ వ్రతం

సిద్దవటం : మండలంలోని మంగళగౌరీ సమేత అమరలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రావణమాస తొలి మంగళవారం సందర్భంగా మంగళ గౌరీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి గణపతిపూజ, గణపతి హోమం, నవగ్రహ శాంతి, ప్రత్యంగిరి హోమం జరిపారు. అలానే అమ్మవారికి పంచామృతాభిషేకం చేశారు. పెద్ద ఎత్తున వచ్చిన మహిళలందరితో సంప్రదాయ బద్ధంగా సామూహిక మంగళగౌరీ వ్రతాన్ని చేయించారు.